నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శనివారం 6 జూలై 2024 | MEDAK

మెదక్ జిల్లా నిజాంపేటలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్‌గౌడ్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌ను ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు

సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు



సిద్దిపేట టూటౌన్‌లో అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను పరామర్శిస్తున్న పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, తదితరులు

అష్టదిగ్బంధం

- ఉమ్మడి మెదక్ జిల్లాలో ముందస్తు అరెస్టులు
- టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్లకుండా అర్ధరాత్రి నేతల నిర్బంధాలు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకుల ఆగ్రహం
- విద్యార్థి సంఘాల నేతలను ఎక్కడికక్కడ పోలీస్‌స్టేషన్లకు తరలింపు

ప్రజాపాలన అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. సర్కారు ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరుద్యోగులు హైదరాబాద్‌లో శుక్రవారం తలపెట్టిన టీజీపీఎస్సీ ముట్టడికి యత్నించగా..ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. జిల్లా నుంచి తరలివెళ్లే నిరుద్యోగ యువకులను, ఆయా సంఘాల నాయకులను గురువారం అర్ధరాత్రి నుంచే పోలీసులు నిర్బంధించారు. మరికొన్ని చోట్ల ఆయా నేతలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందలాది మంది నిరుద్యోగ యువకులను, విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

– ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌వర్క్, జూలై 5

సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

సంగారెడ్డి జడ్పీ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ క్రాంతి

ప్రత్యేకాధికారుల పాలన షురూ

- మండల పరిషత్, జడ్పీల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం
- బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు
- ఫిబ్రవరి 1 నుంచి గ్రామ పంచాయతీల్లో అమలు
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వెనకడుగు
- నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న జీపీలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 జీపీలు, 68 మండల పరిషత్‌లు, 3 జడ్పీలు
- ప్రత్యేకాధికారుల పాలనలో అభివృద్ధి జరిగేనా..

సిద్దిపేట, జూలై 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా, ఇప్పు డు మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ఈనెల 3వ తేదీతో మండల, జిల్లా పరిషత్‌లకు పదవీకాలం ముగిసింది. దీంతో పల్లె నుంచి మండల పరిషత్, జిల్లా పరిషత్ వరకు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లింది. స్థానిక సంస్థల్లో కీలకమైన పరిపాలనా పగ్గాలు అధికారుల చేతిలోకి వెళ్లిపోయాయి. ఫిబ్రవరి 1 నుంచి గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను నియమించారు. ఈనెల ఈనెల 3న ఎంపీపీలు, జడ్పీటీసీల పదవీకాలం ముగియడంతో జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించడంతో వారు బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్‌కు జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారిగా వ్యహరిస్తారు. శుక్రవారం నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది.

ఉమ్మడి జిల్లాలో...

ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 1615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల పరిషత్‌లు 68, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి 3 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 23 మండల పరిషత్‌లు, 499 గ్రామ పంచాయతీలు, మెదక్ జిల్లాలో 20 మండల పరిషత్‌లు, 469 గ్రామ పంచాయతీలు, సం గారెడ్డి జిల్లాలో 25 మండల పరిషత్‌లు, 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా లేకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రత్యేకాధికారుల పాలన ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. 2014లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. మళ్లీ 2019 జూలై రెండోసారి మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలను ఇదివరకు నిర్వహించాల్సి ఉండగా.. ప్రభుత్వం వెనకడుగు వేసింది. ఇప్పుడు మండల, జిల్లా పరిషత్‌లకు సైతం ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం కులగణన చేపట్టేది ఎన్నడూ..అది పూర్తయ్యేదెన్నడూ...ఎన్నికలను నిర్వహించేది ఎప్పుడూ అనే సందేహాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గాలు లేకపోతే గ్రామాలు, మండలాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావు. ఫలితంగా అభివృద్ధిలో వెనుకబడి పోతాయి. ఇప్పటికే స్థానిక సంస్థల్లో నిధుల కటకట వేధిస్తున్నది. చిన్నచిన్న పనులకు నిధులు లేవు. పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేస్తున్నారు. ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వడం లేదు. ప్రత్యేకాధికారులను నియమించిన నేపథ్యంలో మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 5: మహిళా శక్తి లబ్ధిదారుల యూనిట్ల గ్రౌండింగ్‌ను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామీణ మహిళా శక్తి కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేసేందుకు మహిళా క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా బ్యాంకుల ద్వారా మహిళా శక్తి యూనిట్ల ఎంపిక సక్రమంగా జరగాలన్నారు. మొత్తం 13 రకాల యూనిట్ల ద్వారా మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, అదనపు డీఆర్డీవో జంగారెడ్డి, డీపీఎంలు, సీపీఎంలు ఇతర శాఖల జిల్లా అధికారులు, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిల్లా ప్రత్యేకాధికారిగా కలెక్టర్

జడ్పీ పాలకవర్గాలకు గురువారంతో గడువు ముగిసింది. దీంతో కలెక్టర్‌కు జడ్పీ ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. శుక్రవారం జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించారు.

కలుపు పనుల్లో కూలీలు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో పత్తి మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో రైతులు పత్తి పంటలో కలుపు తీత పనుల్లో నిమగ్నమయ్యారు. సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామ శివారులో మహిళా రైతులు కలుపుతీస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.

– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి, జూలై 5

'బగలాముఖి'లో అమావాస్య పూజలు

శివ్వంపేట, జూలై 5: శివ్వంపేట లోని బగలాముఖి శక్తిపీఠంలో అమావాస్య సందర్భంగా అమ్మవారి ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఉదయం నుంచి హరిద్రార్చన, అభిషేకం, బగలా అష్టోత్తర నామార్చనలు, మంత్రపుష్పం, పూర్ణాహుతి వంటి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శక్తిపీఠం స్థల దాత పబ్బ రమేశ్‌గుప్తా, శాస్త్రుల పురుషోత్తంశర్మ, శాస్త్రుల దేవదత్తుశర్మ, శాస్త్రుల సంతోషిశర్మ, సూర్యంకుమార్‌గౌడ్, బాసంపల్లి రామాగౌడ్, గడ్డమీది కృష్ణాగౌడ్, వంజరి కొండల్, ముద్దగల్ల లక్ష్మీనర్సయ్య, వీరస్వామిగౌడ్, సుదర్శన్‌గౌడ్, సంద్ర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

హుస్నాబాద్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలి

- ఇరిగేషన్ పెండింగ్ పనులు వేగంగా పూర్తిచేయాలి
- అధికారులే ప్రజాప్రతినిధుల పాత్ర పోషించి ప్రజా సమస్యలు పరిష్కరించాలి
- నియోజకవర్గ అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్
- హాజరైన సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులు

హుస్నాబాద్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూలై 5: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడంలో అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతి అభివృద్ధి పనిని సకాలంలో పూర్తిచేసి, చేయబోయే పనులను తన దృష్టికి తీసుకురావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని సమీకృత కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై జరిగిన సమీక్షా సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, కరీంనగర్ కలెక్టర్ ప్రమీలా సత్పతి, హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో వ్యవసాయం, విద్య, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారించి వీటిల్లో ఏ సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని, గౌరవెల్లి రిజర్వాయర్ పూర్తి చేయడానికి నిధులు, చేయాల్సిన పనుల వివరాలను అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజనుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వారి సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. హుస్నాబాద్‌ను పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు ఎల్లమ్మ చెరువును అభివృద్ధి చేయాలన్నారు. ఎల్లమ్మ ఆలయం, గౌరవెల్లి, శనిగరం ప్రాజెక్టులు, మహాసముద్రం గండి, రాయికల్ జలపాతం, సర్వాయిపేట కోట, పీవీ గ్రామం వంగర, కొత్తకొండ వీరభద్రస్వామి టెంపుల్ అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సరఫరా, రోడ్ల నిర్మాణం, ఇరిగేషన్ పనులతో పాటు చేనేత, వ్యవసాయాధారిత రంగాల అంశాలపై రూట్ మ్యాప్ తయారు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని, స్వశక్తి సంఘాలను బలోపేతం చేయాలని, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గౌరవెల్లి, దేవాదుల ప్రాజెక్టులకు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ఆయకట్టుకు సత్వరంగా నీరందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. సమావేశంలో మూడు జిల్లాల కలెక్టర్లతోపాటు అడిషనల్ కలెక్టర్లు గరిమా అగర్వాల్, ప్రపుల్ దేశాయ్, రాధికగుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకిరణ్‌వెంకట్‌రెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గౌరవెల్లి భూనిర్వాసితులను ఆదుకుంటాం

గౌరవెల్లి భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని, వారికి బకాయిలు చెల్లించేందుకు కృషిచేస్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. సమీక్షా సమావేశం అనంతరం ఐవోసీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వాయర్‌పై కొందరు రైతులు, నిర్వాసితులు ఎన్‌జీటీలో వేసిన కేసులను ఉపసంహరించుకునేలా వారితో మాట్లాడుతామన్నారు. రిజర్వాయర్‌కు కావాల్సిన నిధులు, చేయాల్సిన పనులపై అధికారులతో చర్చించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ఆయకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తామన్నారు. సమీక్షా సమావేశంలో 15అంశాలపై చర్చ జరిగిందని, పలు అంశాలను కలెక్టర్లు, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, వాటిని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. మళ్లీ మూడు నెలలకు నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించి పనులను పర్యవేక్షించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

హుస్నాబాద్ సమీక్షా సమావేశానికి హాజరైన సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులు

పథకాలకు పరేషాన్..!

- ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్ ఉత్తమాటేనా...?
- కరెంటు, గ్యాస్ కోసం రోజుల తరబడి తిరుగుతున్న జనం
- ఆన్‌లైన్‌లో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఉచితాలను పొందలేకపోతున్న లబ్ధిదారులు

హుస్నాబాద్, జూలై 5: 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత కరెంటు, సబ్సిడీ గ్యాస్ ఇచ్చుడు ఉత్తమాటేనా...? వీటికోసం దరఖాస్తు చేసుకొని నెలల తరబడి ఎదురుచూసినా కొందరికి మాత్రమే వచ్చి మరికొందరికి రాకపోవడం ఏమిటీ...? అసలు సర్కారోళ్లు ఇస్తరా...ఇయ్యరా...? రోజు మున్సిపాలిటీకి, గ్రామ పంచాయతీకి, కరెంటు ఆఫీసు, గ్యాస్ ఆఫీసుల చుట్టూ తిరిగేటందుకే సరిపోతున్నది... ఇక మాకు వస్తదో లేదో...ఓట్లేసేదాక ఒక మాట, ఓట్లేసినంక మరో మాట అన్నట్టున్నది సర్కారు తీరు... ఆరు నెలలుగా ఇగ వస్తది...అగ వస్తది అనుకొని ఎదురుచూడటం తప్ప ఏమీ రావడం లేదు...ఇట్లాంటోళ్లు ఎందుకు చెప్పాలె...ఎందుకు మోసం జేయాలే...' అంటూ మున్సిపాలిటీకి, గ్రామ పంచాయతీ కార్యాలయాలకు వచ్చిన జనం చర్చించుకుంటున్నరు. ఉచితాలంటూ ఎన్నికలకు ముందు ఆశపెట్టి అనంతరం మోసం చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

6,919 ప్రజా పాలన దరఖాస్తులు...

హుస్నాబాద్ పట్టణంలో ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర సబ్సిడీల కోసం స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులు మొత్తం 6,919 ఉన్నాయి. ఇందులో సుమారు 2వేలకు పైగా దరఖాస్తుదారులకు కరెంటు, గ్యాస్ అందడం లేదు. కొన్నింటిని మున్సిపల్ సిబ్బంది, గ్యాస్ సిబ్బంది ఆన్‌లైన్‌లో సరిచేయడంతో పరిష్కారం కాగా, మిగతా వాళ్లు నిత్యం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం కనీసం వెయ్యి మందికి ఉచిత కరెంటు రాకపోవడం, గ్యాస్ డబ్బులు పడకపోవడం లాంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొందరికి వచ్చి మిగతా వారికి రాకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఆరు నెలలుగా కరెంటు బిల్లులు కడుతూ, గ్యాస్ కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. కొందరు లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో సరిగ్గానే ఉన్నప్పటికీ కరెంటు, గ్యాస్ డబ్బులు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఎడిట్ ఆప్షన్ ఇవ్వడమే పరిష్కారం...

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో లోపాలను, దరఖాస్తు దారులు తాము ఇచ్చిన దరఖాస్తుల్లో చేసిన తప్పిదాలను సరిచేసి అందరికీ కరెంటు, గ్యాస్ అందేలా చేయాలంటే కేవలం ఎడిట్ ఆప్షన్ ఇవ్వడమే సరైన పరిష్కారమని పలువురు నిపుణులు అంటున్నారు. హడావిడిగా తీసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఆగమేఘాలమీద ఆన్‌లైన్ చేయడం, అవగాహన లేని వారికి కూడా ఆన్‌లైన్ చేసే బాధ్యతలు అప్పగించడంతో అనేక లోటుపాట్లు చోటు చేసుకున్నాయి. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఎడిట్ ఆప్షన్ ఇచ్చి ఆరు నెలలుగా నష్టపోయిన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద కరెంటు, గ్యాస్ సబ్సిడీ కోసం, ఇతర సమస్యల కోసం నిలిక్షిస్తున్న మహిళలు

ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ వస్తలేదు

ఉచిత కరెంటు, గ్యాస్ డబ్బులు వస్తలేవు. మా కాలనీల కొందరికి వస్తున్నయ్ మరి కొందరికి రావడం లేదు. నేను కొన్ని నెలల నుంచి మున్సిపల్ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా. అయినా నాకు రావడం లేదు. నా పక్కోళ్లకు వచ్చి నాకు రాకపోవడమేంటీ. మాది నిరుపేద కుటుంబం. అయినా నాకు సర్కారు నుంచి సాయం అందడం లేదు. ఇంకా ఎన్ని రోజులు తిరగాలె. రేపు ఎల్లుండి అనుకుంట తిప్పుతండ్రు. ఎప్పుటి నుంచి వస్తయో చెప్పుతలేరు. సర్కారోళ్లు మాలాంటి పేదోళ్లకు ఇవ్వకుండా ఇంకెవరికి ఇస్తరు. చేతకాకుంటె మొత్తానికే బందు పెట్టాలె. కాని కూలీ పనిచేసుకునే మాలాంటోళ్లను ఇట్ల తిప్పుకోవడం మంచిది కాదు.

– మోతె లక్ష్మి, హుస్నాబాద్

నరికేశారు..వదిలేశారు

- పెరిగిన చెట్లను అడ్డంగా నరికేశారు..
- రోడ్లపైనే వదిలేసిన చెట్ల కొమ్మలు..
- వాహన చోదకులకు ఇబ్బందులు

దుబ్బాక, జూలై 5: బీఆర్ఎస్ హయాంలో హరితహారంలో నాటిన మొక్కలు నేడు అధికారుల నిర్లక్ష్యంతో గొడ్డలి వేటుకు బలవుతున్నాయి. రహదారుల పక్కన పచ్చలహారంగా పెరిగిన చెట్లను విద్యుత్ సిబ్బంది అడ్డంగా నరికేస్తున్నారు. వర్షకాలంలో ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి కరెంట్ సరఫరాలో సమస్యలు నెలకొంటాయని వాటిని తొలిగిస్తున్నామంటున్నారు. కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించకుండా పెరిగిన చెట్లను అన్నింటిని అడ్డంగా నరికేస్తున్నారు. నరికేసిన చెట్లను, వాటి కొమ్మలను రోడ్లపైనే వదిలేయడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్నాళ్లు రోడ్డుకిరువైపులా పచ్చదనంతో కనువిందు చేసిన చెట్లను అడ్డంగా నరికేయడంతో రహదారులు బోసిపోతున్నాయి.

రోడ్డుపైనే నరికేసిన చెట్ల కొమ్మలు

దుబ్బాక మున్సిపల్‌తోపాటు మండలంలో నాటిన హరితహారం మొక్కలు నేడు గొడ్డలి వేటుకు బలి అవుతున్నాయి. ఐదేండ్లుగా చెట్లను సంరక్షించడంతో గ్రామాలు, పట్టణం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారింది. పచ్చదనంతో పాటు చల్లని చెట్ల నీడలో స్థానికులతో పాటు పక్క గ్రామాల ప్రజలు సేద తీరేవారు. ఇటీవల విద్యుత్ సిబ్బంది దుబ్బాక పట్టణంలో పెరిగిన చెట్లను పూర్తిగా నరికేశారు. చెట్లను నరికేయడంతో దుబ్బాక పట్టణంలో పచ్చదనం కనుమరుగైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంతో పాటు దుబ్బాక నుంచి అప్పనపల్లి మీదుగా సిద్దిపేటకు వెళ్లే రహదారిలో ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లను అడ్డంగా నరికేశారు. చెట్ల కొమ్మలను కాకుండా చెట్టు కాండం వరకు నరికేశారు.

దుబ్బాక పట్టణంలో ఎలక్ట్రిసిటీ సిబ్బంది నరికేసిన చెట్టు

దుబ్బాక-అప్పనపల్లి రోడ్డులో హరితహారం చెట్లను నరికిన విద్యుత్ సిబ్బంది

దుబ్బాక-అప్పనపల్లి రోడ్డులో నరికేసిన చెట్లకొమ్మలను రోడ్డుపైనే వదిలేసిన దృశ్యం